ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు

శనివారం 25 జనవరి 2025



కారంచేడు పోలీస్‌స్టేషన్‌లో విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

నేర నియంత్రణే లక్ష్యం

- పోలీసింగ్ ప్రతి చోటా కనిపించాలి
- కారంచేడులో డీజీపీ ద్వారకా తిరుమలరావు

కారంచేడు(పర్చూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తున్నదని డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. శుక్రవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. నూతనంగా నిర్మించిన సిబ్బంది విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పర్చూరు, చీరాల శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, ఎంఎం కొండయ్య, ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో డీజీపీ మాట్లాడుతూ పోలీసింగ్ ప్రతి చోట కనిపించినప్పుడే నేరాలు తగ్గుతాయన్నారు. నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని భవిష్యత్‌లో నేరాలు, అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీ కెమేరాలను ఏర్పాటు చేసే విధంగా ముందడుగు వేస్తున్నామన్నారు. ప్రజలు ముందుకు వచ్చి వారి వారి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, ఇంటి పరిసరాలలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.





పేదింటికి.. చేయూత

సొంతిల్లు.. అందరి కల. పేదలకు గృహయోగం సాకారం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకా లు తీసుకొచ్చినా ఆశించిన ఫలితాలు రావడంలేదు. ఆయా పథకాలను సద్వి నియోగం చేసుకునేందుకు పెద్దగా పేదలు ముందుకు వచ్చే వారు కాదు. కొందరు ఇళ్లు పొందినా వాటిలో ఉండలేక చాలామంది అమ్ము కోవడం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 2015లో అమల్లోకి తెచ్చిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎం ఏవై)లో భారీ మార్పులు తెచ్చింది. పీఎంఏవై-2.0 పేరుతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా మార్పు లు చేసింది. ఈ పథకంతో రెట్టింపు సాయం అందించి పేదల గృహయో గానికి చేయూతగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.

రెట్టింపు సాయంతో గృహయోగం

- పీఎంఏవై 2.0పై ప్రభుత్వం కసరత్తు
- మూడు రూపాల్లో పథకం విస్తరణ.. రాయితీలు
- అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరేలా పథకం రూపకల్పన

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన వారు కూడా సొంత ఇంటిలో నివాసం ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసింది. గతంలో ఎన్నో పథకాలు ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదని తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం భారీ మార్పులతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కు శ్రీకారం చుట్టింది. పేదలకు మరింత చేయూత అందిస్తూ.. నిర్మాణానికి రెట్టింపు సాయం అందించేలా పథకంలో భారీ మార్పులు చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే ఆర్థికంగా అట్టడుగు వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన వారు, తక్కువ, మధ్య ఆదాయ సమూహాలుగా ఈ పథకాన్ని విస్తరించింది. తద్వారా సమాజంలోని అన్ని వర్గాలవారికి ఆర్థిక చేయూతను అందించేలా పీఎంఏవై 2.0 ఉండనున్నది. 2024 చివరిలో పీఎంఏవై 2.0కు శ్రీకారం చుట్టగా మెజారిటీ పేదలకు గృహ యోగం లభించనున్నది. కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)కి శ్రీకారం చుట్టింది. సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేయూత అందించింది. ఈ పథకంలో భాగంగా పీఎం ఏవై (అర్బన్) కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు (మిగతా 7వ పేజీలో)

నాలుగు రకాలుగా..

- **బీపీఎల్ :** దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఆర్థికంగా అట్టడుగు వర్గాలు.
- **ఈడబ్ల్యూఎస్ :** ఆర్థికంగా బలహీనమైన విభాగం.
- **ఎల్‌ఐజీ :** తక్కువ ఆదాయ సమూహం.
- **ఎంఐజీ :** మధ్య ఆదాయ సమూహం

తక్కువ ధరల్లో అద్దె ఇళ్లు(ఏఆర్‌హెచ్)

ఇప్పటి వరకు సొంత ఇళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పథకం పట్టణంలో ఉండే నిలువ నీడలేని వలస కూలీల కోసం తక్కువ ధరలో అద్దె ఇళ్ల అందించే ప్రయత్నం చేస్తోంది. శ్రామిక మహిళలు, పారిశ్రామిక కార్మికులు, నిరాశ్రయులు, విద్యార్థులు ఇతర లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ భవనాల్లోని ఖాళీ ప్లాట్లను తక్కువ అద్దెకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. వాటిని స్వల్ప కాలిక ప్రాతిపదికన అందించాలని భావి స్తోంది. ఇది ఆచరణలో సాధ్యం కాకపోవచ్చని, అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని అధికారులు భావిస్తున్నారు.



గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయింపు

- బాపట్లలో లాటరీ తీసిన కలెక్టర్ జె.వెంకటమురళి



గీత కార్మికులకు లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తున్న కలెక్టర్ జె.వెంకమురళి, ఎక్సైజ్ అధికారులు

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గీత, గౌడ కులాలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ శుక్రవారం జరిగింది. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం లాటరీ పద్ధతిలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. లాటరీలో జిల్లా వ్యాప్తంగా 12 మద్యం దుకాణాలు గీత కార్మికులకు కేటాయించినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. నిబంధనలు అనుసరించి దుకాణాలు కేటాయించామన్నారు. బాపట్ల పట్టణం, రేపల్లె, అద్దంకి గ్రామీణం, అమర్తలూరు, ఇంకొల్లు, చుండూరు, జెపంగులూరు, వేటపాలెం ప్రాంతాలలో గౌడకులాలకు దుకాణాలు దక్కాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖాధికారి శివలీల, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- గ్రీవెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

బాపట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. గిరిజనుల కోసం శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి నుంచి అర్జీలు స్వీకరించారు. వెదుళ్లపూడి, బేతపూడి, స్వావర్తుపురం గ్రామాలలో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్‌పుస్తకాలు మంజూరుచేయాలని కలెక్టర్‌కు జాతీయ గిరిజన ఫెడరేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాము అర్జీ అందజేశారు.ఎస్టీకాలనీలో శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. వెదుళ్లపల్లి గిరిజన హాస్టల్‌ను గిరిజన సంక్షేమశాఖకు అప్పగించాలని కోరారు. చుండూరు మండలం వలివేరు, పెనుగుదురు గ్రామాలలో శ్మశానభూములు కావాలని అర్జీ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంఘం అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు కోరారు. వలివేరు గిరిజనకాలనీలో తాగునీరు, మురుగునీటి కాల్వలు ఏర్పాటుచేయాలని స్థానికులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, సీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి బి.ప్రకాష్, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్డీవో పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

డీఆర్సీ సమావేశంలో బాపట్ల అభివృద్ధికి సంబంధించి సమగ్ర వివరాలను అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీపీటీ నివేదికను పరిశీలించారు. సమాచారం సమగ్రంగా ఉండాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంటింటా ప్రజారోగ్య సర్వే నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు 66,946 గృహాలలో ఆరోగ్యసర్వే పూర్తిచేశామన్నారు. ప్రాంతీయ వైద్యశాలను జిల్లా వైద్యశాలగా మార్చాలని నివేదిక పంపామన్నారు. రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను కాపాడటానికి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. మనబడి, మనభవిష్యత్తు కింద 1571 పనులు మంజూరు కాగా 1052 పనులు పూర్తి అయ్యాయన్నారు. రూ.4.43కోట్లతో సమగ్ర శిక్షాభియాన్ కింద జరుగుతున్న 147 పనులను సత్వరమే పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సేంద్రియ వ్యవసాయోత్పత్తుల పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. 2.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా 78శాతం ఈ-క్రాప్ పూర్తి అయిందన్నారు. ఉద్యాన పంటల సాగులో జిల్లా 90శాతానికి పైగా లక్ష్యాలను చేరుకుని రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. గుండ్లకమ్మ జలాశయంలో 1.50 లక్షల చేప పిల్లలు వదలడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నిజాంపట్నం ఓడరేవు అభివృద్ధిపై సమగ్ర వివరాలను నివేదికలో పొందపర్చాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు



కుర్రా అప్పారావు



మక్కెన మల్లికార్జునరావు

- చైర్మన్ పదవి కోసం పోటాపోటీ
- సిఫార్సు లేఖలతో రంగంలో మక్కెన మల్లికార్జునరావు, కుర్రా అప్పారావు
- అత్యధిక మంది ప్రజాప్రతినిధుల మద్దతుతో అప్పారావు
- వైసీపీని వీడి టీడీపీలో చేరడం మల్లికార్జునరావుకి మైనస్


గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే కీలకమైన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) ఛైర్మన్‌పదవి కోసం టీడీపీలో ఇద్దరు నేతలు పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మరొకరు టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు. మక్కెన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుతో పాటు వైసీపీని వీడి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అంతకు ముందు ఆయన వైసీపీలో కొనసాగుతూ 2019 ఎన్నికల్లో వినుకొండ వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు విజయానికి సహకరించారు. ఆ తర్వాత బొల్లాతో విభేదించి పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే అప్పటికే వైసీపీ ఎంపీగా కొనసాగుతున్న శ్రీకృష్ణదేవరాయలుతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు. ఆయనతో ఉన్న సాన్నిహిత్యం మూలంగానే 2024 ఎన్నికల నాటికి టీడీపీలో చేరి వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజయానికి కృషి చేశారు. దీంతో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ పదవికి మక్కెన పేరును సిఫార్సు చేస్తూ ఎమ్మెల్యే ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా మక్కెనకు ఇవ్వాలని కోరుతూ లేఖలు ఇచ్చారు. ఇక ఛైర్మన్ పదవి ని ఆశిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన కుర్రా అప్పారావు రేసులో ముందంజలో ఉన్నారు. ఛైర్మన్ పదవి పొందేందుకు ఏదో ఒక సొసైటీ నుంచి అధ్యక్షుడిగా గెలుపొందాల్సి ఉండటంతో తన సొంత మండలమైన యడ్లపాడులోని మర్రిపాలెం గ్రామాన్ని అప్పారావు ఎంచుకుని గ్రౌండ్ సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ సొసైటీ నుంచి ఆయన తండ్రి కుర్రా రత్తయ్య సొసైటీ అధ్యక్షుడుగా ఉన్నారు. రత్తయ్య జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా చాలా కాలం పనిచేశారు. అప్పారావు గతం లో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శిగా పనిచేశారు. తొలి నుంచి టీడీపీకి ఆయన కుటుంబం అంకితమై పనిచేస్తున్నది. గతంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య విజయానికి, ఆ తర్వాత మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విజయంలో అప్పారావు కుటుంబం కీలకంగా వ్యవహరించింది. అలాగే ఇటీవల ఎన్నికల్లో సొంత నియోజకవర్గమైన చిలకలూరిపేటలో పుల్లారావు గెలుపునకు, పెదకూరపాడు నుంచి పోటీ చేసిన తన చిన్ననాటి మిత్రుడు భాష్యం ప్రవీణ్ గెలుపులోనూ అప్పారావు ప్రధాన పాత్ర పోషించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బరిలోకి దిగిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి హార్థిక, ఆర్థిక సహకారం కూడా తన వంతుగా అందించారు. దీంతో అప్పారావు ఆశిస్తున్న ఛైర్మన్ పదవికి తొలి నుంచి పార్టీలో ఉన్న వారెవరూ కూడా పోటీకి రాలేదు. అంతేకాకుండా అప్పారావుకు పదవి ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఇద్దరు ఎంపీలు, సీనియర్ ఎమ్మెల్యేలందరూ సిఫార్సు లేఖలు ఇచ్చారు. సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యేలైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, కన్నా లక్ష్మీనారాయణలు సైతం అప్పారావును బలపరిచారు. అలాగే గుంటూరు జిల్లా (మిగతా 7వ పేజీలో)



మత్స్యకార భృతి.. రూ. 20 వేలు



చీరాల పరిధిలోని ఓడరేవు తీరంలో చేపల వేటకు వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు (ఫైల్ ఫొటో)



- వేట విరామంలో రెట్టింపు భృతికి హామీ
- వారంలో కొలిక్కి రానున్న లబ్ధిదారుల జాబితా
- గత ప్రభుత్వంలో 1,500 మంది అనర్హులున్నట్లు గుర్తింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని రూ.10 వేల నుంచి ఇరవై వేలకు పెంచి అందిస్తామని గడచిన ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. గత ప్రభుత్వంలో అర్హులైన వేల మంది గంగపుత్రులు మత్స్యకార భృతికి దూరంగా ఉండిపోయారు. వైసీపీ నేతల అనుచరగణాన్ని కూడా మత్స్యకారుల జాబితాలో చేర్చి అనర్హులకు ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారు. ప్రస్తుతం అనర్హుల ఏరివేతతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందుకోసం పడవల సంఖ్యను నమోదు చేయడంతో పాటు వీటిలో రిజిస్ట్రేషన్ అయినవి ఎన్ని, చిన్నవి, పెద్దవి ఎన్ని వీటిపై ఆధారపడి చేపల వేట ద్వారా జీవనం సాగిస్తున్న వారి సంఖ్య ఎంత మంది అనే వివరాలను యంత్రాంగం నమోదు చేస్తోంది. ఇప్పటికే దాదాపు జాబితా ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో దాదాపు 1,500 మంది వరకు అర్హత లేకపోయినా సాయం అందుకున్నట్లు గుర్తించారు. వీరందరికి సమాచారం ఇచ్చి వివరణ కోరి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. దాదాపు 14,500 మందికి రెట్టింపు మత్స్యకార భృతి అందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అండగా ఉండనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో సుదూర తీరప్రాంతం ఉండడంతో చేపల వేటపై ఆధారపడి బతికే మత్స్యకారుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. దాదాపు 48,000 వరకు మత్స్యకార జనాభా ఉండగా వీరిలో 19,000 మంది వేటే బతుకుదెరువుగా ఉన్నారు. పడవలు, మరబోట్ల సంఖ్య 2,900 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాదాపు 14,500 మంది మత్స్యకారులకు రూ.20,000 భృతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మత్స్యశాఖ సిబ్బంది గడచిన పక్షం రోజులుగా శ్రమిస్తూ ఉండగా మరో వారం రోజుల్లో జాబితా ఓ కొలిక్కి రానుందని తెలుస్తోంది.

చేపలు గుడ్లు పెట్టే వేళ....

ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల వేటకు విరామాన్ని ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సమయంలో చేపలు గుడ్లు పెడతాయి కనుక వేట వల్ల వలల్లో చిక్కుకుని అవి బయటకు వచ్చే ప్రమాదం ఉండడం, తద్వారా మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో వేటకు గంగపుత్రులు రెండు నెలల పాటు దూరంగా ఉంటారు. ఈ సమయంలో వారి జీవనోపాధికి ప్రభుత్వాలు సాయం చేస్తూ ఉంటాయి.

7

అలా ఎందుకు చేశారో చెప్పండి?

- యార్డు కార్యదర్శికి మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశం
- మంత్రి లేఖ బట్టబయలుపై మెమో జారీ

కుక్కల కు.ని కేంద్రంలో తనిఖీ

- డంపింగ్ యార్డు వద్ద శస్త్రచికిత్సలు చేయటంపై విచారణ

రూ.6 వేల పింఛన్ ప్రభుత్వ ఘనతే

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి వీరాంజనేయస్వామి



సచివాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా

ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు: ఎంకే మీనా

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు అని రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన ఉద్యోగులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులుగా, ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. గత ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో ఓటింగ్ శాతం 80కిపైగా నమోదు చేసి రికార్డు సృష్టించాం. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను, ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే వారినీ ప్రత్యేకంగా సత్కరించుకుంటున్నాం' అని మీనా పేర్కొన్నారు.

గణతంత్ర వేడుకలకు గిరిజన అతిథిగా గురునాథం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకలకు ప్రత్యేక గిరిజన అతిథిగా హాజరుకావాలని టీడీపీ నాయకుడు, మాదిగాని గురునాథంకు కేంద్రప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. గణతంత్ర వేడుకలకు హాజరుకావడానికి ఢిల్లీ చేరుకున్న ఆయన శుక్రవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో ఇతర గిరిజన అతిథులతో పాటు కలిశారు.

'విత్తన ధ్రువీకరణ' ఉన్నతాధికారులపై ఏసీబీకి ఫిర్యాదు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లాంలోని రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీలోని ఇద్దరు ఉన్నతాధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదులు వెళ్లాయి. వీరు ఆదాయాన్ని మించి భారీగా ఆస్తులు కూడగట్టారని పలువురు ఏసీబీకి లేఖ రాసినట్లు తెలిసింది. విత్తన ధ్రువీకరణ అధికారులుగా పనిచేస్తున్న ముగ్గురికి పదోన్నతులు కల్పించినందుకు రూ.లక్షల్లో ముడుపులు పుచ్చుకున్నారని సమాచారం. 'విత్తన క్షేత్రాలు, విత్తన నాణ్యత, విత్తన, పరిశోధన ఫలితాల విషయంలో నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, కొత్త సిబ్బంది నియామకాల్లో ముడుపులు తీసుకుంటున్నారు. వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణ వ్యయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీనిపై కౌంటర్ వేయకుండా, ముడుపులు పుచ్చుకుని, కొనసాగిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 25మందిలో ఐదుగురిని పర్మినెంట్ చేసే ప్రయత్నాలు చేయగా, బోర్డు మీటింగ్‌లో బెడిసికొట్టింది. సంస్థ వాహనాన్ని హైదరాబాద్‌లో కీలక అధికారి కుటుంబ సభ్యులు వాడుతుంటే, ఏపీలో ఉపయోగిస్తున్నట్లు లాగ్‌బుక్‌లో రాస్తున్నారు. మరో ఉన్నతాధికారి తాత్కాలిక ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి, ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని, అక్రమాలకు పాల్పడుతున్నారు' అని ఏసీబీ డైరెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

'ఫెర్రో'కు తగ్గించిన విద్యుత్ సుంకం కొనసాగింపు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ నుంచి యూనిట్‌కు ఆరు పైసలు చొప్పున వసూలు చేస్తున్న విద్యుత్ సుంకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. గతంలో యూనిట్‌కు 10 పైసలు చొప్పున వసూలు చేస్తున్న సుంకాన్ని ఆరు పైసలకు తగ్గించారు. ఆ తగ్గింపు సుంకాన్నే మరో ఏడాది కొనసాగించాలన్న ఫెర్రో ఎల్లాయిస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ పరిశ్రమపై 30,000 మంది ఉద్యోగులు వారి కుటుంబాలూ ఆధారపడి ఉన్నాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వులో వివరించారు.





గణతంత్ర వేడుకలకు ముస్తాబైన సచివాలయ భవనాలు

గాడిలో గ్రామీణాభివృద్ధిశాఖ!

సంస్కరణల బాట పట్టించాలని నిర్ణయం

- పంచాయతీరాజ్ తరహాలో ప్రక్షాళన చేసే యోచన
- ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి
- వేతనాలు పెంచేందుకు పక్కాగా మార్గదర్శకాలు
- ఎప్పటికప్పుడు సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు
- ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో కసరత్తు ప్రారంభించిన అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్‌శాఖలో ప్రక్షాళన ప్రారంభించిన ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిశాఖలోనూ సంస్కరణలు తీసుకురావాలని యోచిస్తోంది. తొలుత ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. వేతనాలు పెంచేందుకు మార్గదర్శకాలు పక్కాగా రూపొందించాలని నిర్ణయించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామీణాభివృద్ధిశాఖను అస్తవ్యస్తం చేశారు. ప్రధానమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారు. వాటర్‌షెడ్ లాంటి పథకాల నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నింటినీ గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. సమస్యల పుట్టగా ఉన్న గ్రామీణాభివృద్ధిశాఖను కచ్చితంగా సంస్కరించాల్సిన అవసరముందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆయన ఆదేశాలతో ఇప్పటికే కమిషనర్ కృష్ణతేజ ఉన్నతాధికారులతో సంప్రదించి గ్రామీణాభివృద్ధి శాఖలో సమస్యలపై ఒక కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉన్నతస్థాయిలో దానిపై ప్రస్తావన జరిగినట్లు సమాచారం.



పెరగని జీతాలు, దక్కని పదోన్నతులు..

గ్రామీణాభివృద్ధిశాఖలో పథకాలన్నీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే అమలు చేస్తున్నారు. అధికారులను డిప్యుటేషన్ ద్వారా తీసుకున్నారు. కేంద్ర పథకాలైన ఉపాధి, వాటర్‌షెడ్ తదితర వాటిల్లో రాష్ట్రంలో సుమారు 3 వేల మందికి పైగా మండల, జిల్లా స్థాయి సిబ్బంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి లోకేశ్ హయాంలో పెంచిన జీతాలు తప్ప గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వారికి జీతాలు పెంచలేదు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలోనూ ఉద్యోగాలు భారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 2016-17లో అప్పటి కమిషనర్ రామాంజనేయులు ఉపాధి సిబ్బందికి పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత ఆ ఊసే లేదు. గత టీడీపీ ప్రభుత్వం ఆఖరులో ఉపాధి సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.. ఆ తర్వాత వైసీపీ సర్కార్ దానిని పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో స్థానిక నేతల ఒత్తిడితో ఉపాధి హామీ పథకంలో జరిగిన అడ్డగోలు బదిలీలతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించి ఇప్పుడు సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటే దొంగలెక్కలన్నీ బయటపడుతున్నాయి. అప్పట్లో పనులు లేకుండా మస్టర్లు వేసినందుకు ఇప్పుడు రూ.లక్షలు రికవరీలు వస్తున్నాయి. కొన్ని చోట్ల సిబ్బందిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. లేని పనులకు అప్పట్లో ఒత్తిడి చేసి మస్టర్లు వేయించారని, ఇప్పుడు తమను కాపాడేవారు లేరని సిబ్బంది వాపోతున్నారు.

సంస్కరణలు చేపడితేనే పథకం ముందుకు..

గ్రామీణాభివృద్ధిశాఖలో సమూల సంస్కరణలు చేపడితేనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతాయని ఆ శాఖ ఉన్నతాధికారుల్లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వారు మరిన్ని అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. "ఒక నిర్దిష్ట విధానంలో నియామకాలు చేపట్టడంతో పాటు బదిలీలకు కూడా కొత్త మార్గదర్శకాలు రూపొందించాలి. బదిలీల్లో వీలైనంత వరకు రాజకీయ జోక్యం లేకుండా చేయాలి. ఏటా జీతాలు పెంచడంతో పాటు పీఆర్సీకి అనుగుణంగా వేతనాలు మార్చాలి. సోషల్ ఆడిట్‌కు సంబంధించి సిబ్బందిని జవాబుదారీ చేయడంలో మరిన్ని మార్పులు తీసుకురావాలి. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలోనూ మార్పులు చేయాలి. సిబ్బంది అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలి. ఒకే తరహా ఉద్యోగుల్లో ఉన్న వేతనాల వ్యత్యాసాన్ని సరిచేయాలి. సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించాలి. రిటైర్మెంట్ వయసును 62కు పెంచాలి. గ్రాట్యుటీ లాంటి ఇతర ప్రయోజనాలను అందించాలి. సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తవుతాయి" అని వారు పేర్కొన్నారు.



గణతంత్ర ఏర్పాట్లు.. బైక్‌లపై ఫీట్లు

గణతంత్ర వేడుకల నిర్వహణకు వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. వేడుకలకు నగరంలోని రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ముమ్మర సాధన చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ద్విచక్ర వాహనాలపై ఆర్పీఎఫ్ సిబ్బంది విన్యాసాలు చేశారు.

-విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఆలయ పాలకవర్గాల నియామకంపై కసరత్తు

- టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో పల్లా టెలీ కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండళ్ల నియామకంపై టీడీపీ కసరత్తు చేపట్టింది. అర్హతలకు అనుగుణంగా ఈ మండళ్లలో ధర్మకర్తల నియామకానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాయంత్రం ఈమేరకు ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కలిపి సుమారు 500 ఆలయాలకు పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటి భర్తీకి దేవదాయ శాఖ కొన్ని అర్హతలు నిర్దేశించింది. టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ అర్హతలను అన్నింటిని పల్లా శ్రీనివాసరావు చదివి వినిపించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఒకటి రెండు రోజుల్లో తమ ప్రతిపాదనలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆయన వారిని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పాలక వర్గాలకు ఇంకా కొన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు అందకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ నియోజకవర్గాల జాబితాను ఆయన చదివి వినిపించారు. ఇవి సుమారుగా 50 వరకూ ఉన్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు పాలక వర్గాల నియామకంపై కూడా ఇన్‌చార్జి మంత్రులతో ఎమ్మెల్యేలు చర్చించాలని, ఆలస్యం చేయవద్దని ఆయన వారికి సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వేసవికి విడుదల



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ మేరకు నిర్మాతలు రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ ఇంటెన్స్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. భుజంపై రాకెట్ లాంచర్‌తో ఆగ్రహంగా ముందుకు అడుగులేస్తున్న సన్నీ డియోల్ లుక్ అదిరిపోయింది. మొత్తానికి పోస్టర్‌లో ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు, కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని నిర్మాతలు తెలిపారు.

బాలయ్య సరసన సంయుక్త

నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2.. తాండవం'. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెప్పారు. హీరోయిన్లను అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను సంయుక్త కోసం ఓ కీలక పాత్ర సిద్ధం చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీత దర్శకుడు. సి.రామ్ ప్రసాద్ ఛాయాగ్రాహకుడు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



దోమకొండ కోటలో ప్రియాంక చోప్రా

కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోటలో శుక్రవారం ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సందడి చేశారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆమె గడి కోటలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోట తరఫున సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కోట సీనియర్ మేనేజర్ బాబ్జి హీరోయిన్‌కు జ్ఞాపికను అందజేశారు. అద్దాల బంగ్లా, సొరంగ మార్గం, చుట్టూ కందకం, కోట చరిత్రను వివరించారు. ప్రియాంక చోప్రా గతంలో రాంచరణ్‌తో 'జంజీర్' సినిమాలో నటించారు. ఆయన శ్రీమతి ఉపాసన ఈ కోటకు వారసురాలు అనే విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా దోమకొండకు వచ్చిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఉదయమే కోట వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

దోమకొండ (ఆంధ్రజ్యోతి)




యశ్ చిత్రంలో నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతా మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'టాక్సిక్'. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నటీనటుల గురించి ప్రకటించలేదు. కానీ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఇందులో నటిస్తున్నాడంటూ మేకర్స్ ఆ మధ్య ఓ పోస్టర్ వదిలారు. మరోవైపు 'టాక్సిక్' హీరోయిన్ ఈమె నంటూ సోషల్ మీడియాలో ఎంతో మంది కథానాయికల పేర్లు చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ప్రాజెక్టులో నయనతార భాగమైనట్లు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం తాను యశ్ సినిమా షూటింగ్‌లో ఉన్నానని, దీనిలో నయనతార కూడా నటిస్తున్నారని, ఇంతకు మించి నేనేమీ చెప్పలేనని, పూర్తి సమాచారాన్ని డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ ప్రకటిస్తారని అక్షయ్ ఒబెరాయ్ చెప్పారు. అయితే నయనతార ఏ పాత్రలో కనిపించనున్నారనే దానిపై ఆయన స్పష్టతనివ్వలేదు. కాగా ఈ చిత్రంలో బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ ప్రత్యేక గీతంలో నర్తించనున్నారని సమాచారం.

లాస్ ఏంజెలెస్‌లో షూట్ చేస్తాం



'ఫాస్ట్ ఎక్స్ 2' చిత్రం మిగిలిన షూటింగ్‌ను లాస్ ఏంజెలెస్‌లో జరపనున్నట్లు హాలీవుడ్ హీరో విన్‌డీజిల్ ప్రకటించారు. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాలను కార్చిచ్చు దహించివేసిన నేపథ్యంలో ఆ నగరం కోసం తనవంతుగా ఏదైనా చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపారు. 'ఇప్పుడు లాస్ ఏంజెలెస్‌కు మన అవసరం మరింత ఉంది. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంఛైజీలో తొలి చిత్రం షూటింగ్ 25 ఏళ్ల క్రితం ఇక్కడే మొదలైంది. మళ్లీ ఇప్పుడు ఆ నగరంలో 'ఫాస్ట్ ఎక్స్ 2' సినిమా షూటింగ్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. నటి జోర్డానా సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నాను. లాస్ ఏంజెలెస్‌లో పరిస్థితులు కుదుటపడ్డాక చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ ఫ్రాంఛైజీలో వస్తున్న చివరి చిత్రం ఇదే. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. లూయిస్ లెటెర్రీర్ దర్శకత్వం వహిస్తున్నారు.

నాన్న మాటే నా జీవన మంత్రం

- షబానా



'సినిమా దర్శకులకు స్వేచ్ఛ ఉండాలి, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యం' అని బాలీవుడ్ నటి షబానా ఆజ్మీ వ్యాఖ్యానించారు. అలా అని ప్రతి సినిమా సందేశాత్మకంగా ఉండాలి అన్న వాదన కూడా సరికాదన్నారు. చలనచిత్రానికి వినోద విలువలు కూడా అవసరం అన్నారు. షబానా ఆజ్మీ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా హైదరాబాద్ సాహిత్య మహోత్సవం వేదికగా 'ఏ లైఫ్ ఇన్ సినిమా - షబానా ఆజ్మీ' అంశంపై అమితా దేశాయ్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇక్కడే పుట్టి, తొమ్మిదో ఏట వరకు ఉన్న తాను తర్వాత కాలంలోనూ వేసవి సెలవులకు నగరానికి వస్తుండేదాన్నని చెప్పారు. సమాజంలో మార్పు కోసం పనిచేస్తున్న క్రమంలో నిరాశ చెందకుండా, నిబద్ధతతో ముందుకెళ్లడాన్నే తాను విశ్వసిస్తానని షబానా చెప్పారు. మార్పు ఒక్క రోజులో వచ్చేది కాదు, కనుక మనం చేసే పని ఇప్పటికిప్పుడు ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. కానీ రేపటినాడు జరిగే మార్పునకు దోహదపడుతుందని తన తండ్రి కైఫీ ఆజ్మీ చెప్పిన మాటలే తనకు జీవిత సూత్రమని, వాటినే ఆచరిస్తూ ముందుకు సాగుతున్నానని షబానా ఆజ్మీ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

ఇక వెంకటలచ్చిమి అని పిలుస్తారేమో!

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'వెంకటలచ్చిమి'. ముని దర్శకత్వంలో రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మించనున్న ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ముని మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈ రివెంజ్ డ్రామా భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ "మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. నచ్చక తిరస్కరించాను. ఈ సినిమా తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది' అని అన్నారు.



అలా ఎందుకు చేశారో చెప్పండి?

- యార్డు కార్యదర్శికి మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశం
- మంత్రి లేఖ బట్టబయలుపై మెమో జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి లేఖను బట్టబయలు చేసిన వ్యవహారంలో రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ స్పందించారు. ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'మంత్రి లేఖ బట్టబయలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత బాధ్యులపై చర్యలు చేపట్టారు. అధికారిక లేఖను వెల్లడి చేసిన గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి వినుకొండ ఆంజనేయులకు శుక్రవారం మెమో జారీ చేశారు. అధికారిక ఉత్తర, ప్రత్యుత్తరాల దశలో ఉన్న లేఖను ఎందుకు బయట పెట్టారో మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశించారు. అధికారిక లేఖను బట్టబయలు చేయటం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్-1964కు విరుద్ధం అని మెమోలో పేర్కొన్నారు. మెమోకు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని జత పరిచారు.

కుక్కల కు.ని కేంద్రంలో తనిఖీ

- డంపింగ్ యార్డు వద్ద శస్త్రచికిత్సలు చేయటంపై విచారణ


కుక్కల కు. ని కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాతీయ జంతు కల్యాణ మండలి బృందం

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కేంద్రాన్ని జాతీయ జంతు కల్యాణ మండలి బృందం శుక్రవారం తనిఖీ చేసింది. ఈ బృందం లో డాక్టర్ ముఖేష్ గుప్తాతో పాటు మరికొందరు సెంట్రల్ టీమ్ సభ్యులు ఉన్నారు. డంపింగ్ యార్డు వద్ద కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరుగుతున్నాయని గతంలో తనిఖీకి వచ్చిన కేంద్ర బృందం గుర్తించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం ఆ ప్రదేశంలో నిర్వహించటం వల్ల కుక్కల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగే కేంద్రాన్ని వెంటనే మార్చాలని నగర పాలక సంస్థకు సూచించారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ జాతీయ జంతు కల్యాణ మండలి వద్దకు అప్పీల్‌కు వెళ్లింది. యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అదే ప్రదేశంలో నిర్వహిస్తామని, అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటామని విజ్ఞప్తి చేశారు. నగర పాలక సంస్థ అప్పీల్ నేపథ్యంలో కేంద్ర బృందం మరోసారి పరిశీలనకు వచ్చింది. కుటుంబ నియంత్రణ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. తనిఖీల్లో కేంద్ర బృందంతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖకు చెందిన ఏడీఏలు డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ చక్రవర్తి, జంతు సంరక్షణ సమితి సభ్యుడు జాగు సురేష్, జాగు నరసింహారావు పాల్గొన్నారు.

గవర్నర్ తేనేటి విందుకు జాజికి ఆహ్వానం


కొమెర జాజి

కారంపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తేనేటి విందుకు కారంపూడికి చెందిన పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి)కి ఆహ్వానం అందింది. గతేడాది గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ తేనేటి విందుకు కూడా జాజికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జాజిని మండల ప్రజలు అభినందించారు.

రూ.6 వేల పింఛన్ ప్రభుత్వ ఘనతే

- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి


గరల్స్ హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న మంత్రి డోలా

బాపట్ల రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సోషల్ వెల్ఫేర్, డిజెబుల్ అండ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్, సచివాలయం అండ్ విలేజ్ వలంటరీ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలిస్తూ గరల్స్ హాస్టల్ లో డస్ట్‌బిన్స్ లేవనీ, వాటిని త్వరగా ఏర్పాటు చేయాలనీ, కిటికీలకు దోమల మెష్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు, కావాల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బధిరుల ఖాతాకే పింఛన్ జమ

అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ బధిరుల పింఛన్ నేరుగా వారి అకౌంట్‌లకే జమ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారనీ, దీనిని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలోని పాతకాలపు భవనాలకు త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు. దివ్యాంగుల పట్ల సమాజంలో గౌరవం కలగాలనేది ప్రభుత్వ సంకల్పమనీ, దీనిలో భాగంగా విశాఖపట్నంలో 25 ఎకరాలలో రూ. 200 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు మంచాలు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ డొనేట్ చేస్తామనడం అభినందనీయం అన్నారు. బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ, బావుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటనపై విమర్శలు సిగ్గుచేటు

దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏమి తెచ్చారని కొందరు మాజీ మంత్రులు విమర్శించడం సిగ్గుచేటని, కేవలం వాళ్ల ఉనికిని చాటుకునేందుకు మాట్లాడుతున్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తాం


స్మృతి వనం వద్ద వీరయ్య చౌదరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, కుటుంబ సభ్యులు

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి తమకు ఇచ్చిన ఆశయాలను కొనసాగిస్తానని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి 31వ వర్ధంతి, మరో మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వీరయ్య చౌదరి స్మృతి వనం వద్ద కుటుంబ సభ్యులు, నరేంద్ర కుమార్ కుమార్ జ్యోతిర్మయి దంపతులతో పాటు వీరయ్య చౌదరి సతీమణి ప్రమీలాదేవి నివాళులర్పించారు. అనంతరం చింతలపూడి గ్రామంలోని వీరయ్య చౌదరి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నిడుబ్రోలులో జాగర్లమూడి సుధీర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రులు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పాల్గొని నివాళులర్పించారు. మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పఠాన్ ఫైరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో కూరగాయల వర్తక సంఘం నాయకులు ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పేదలకు అన్నదానం చేశారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని వీరయ్య చౌదరి స్మృతి వద్ద ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. నారాకోడూరు సెంటర్లో డీవీసీ, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు. కాకాని వెంకటరత్నం, పశుదాణ కారాగారం డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్లో డీవీసీ వర్ధంతి ఘనంగా జరిగింది. వడ్లమూడి గ్రామంలో డీవీసీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో 500 మందికి ఉచిత వైద్య సేవలు అందించి ట్రస్టు ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంగం డెయిరీ ఆవరణలో డీవీసీ వర్ధంతి ఘనంగా జరిగింది. సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు ఏడు లక్షల నగదు చెక్కును డీవీసీ హాస్పిటల్‌కు చైర్మన్ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా అందజేశారు. సంగం డెయిరీ పరిధిలో మరణించిన పాల రైతులు 8 మందికి రూ. 4.25 లక్షల పరిహారం, ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు రూ.2.71 లక్షలు, పాడి గేదెలు చనిపోయిన 12 మంది రైతులకు రూ. 6.70 లక్షలు పరిహార చెక్కులను చైర్మన్ నరేంద్ర కుమార్ అందచేశారు. పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. సంగం డెయిరీ మాజీ చైర్మన్ కుర్ర వీరయ్య చౌదరి, సుదీర్ఘకాలం పార్టీకి సేవ చేసిన సీనియర్ కార్యకర్తలను ఘనంగా సత్కరించి ఆర్థిక సహాయం అందించారు.

పేదింటికి.. చేయూత

(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్లు అందజేసింది. పీఎంఏవై(గ్రామీణ) కింద గ్రామీణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి చేయూత ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 2.95 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా అర్హులైన పేదల కోసం సర్వే చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఒక విభాగంగా గుర్తించి వారికి సొంత ఇల్లు అందుబాటులోకి తేవడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తుంది. లేనివారికి స్థలం అందజేసి అందులో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే చూసుకుంటోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక విధాన ప్రకటన చేసింది. పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ) కింద వీరికి ఇప్పటి వరకూ కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహాయం కూడా రెట్టింపు కానుంది. ఇప్పటి వరకూ ఇచ్చే రూ.1.50 లక్షల సాయాన్ని ఇక నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఈ మొత్తంలో కేంద్రం వాటాలో ఎలాంటి మార్పు లేదు. గతంలో మాదిరిగా కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా, అదనంగా ఇచ్చే రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా ఉంటుందని సమాచారం. దీంతోపాటు స్వచ్ఛ భారత్ స్కీమ్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, నరేగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.27 వేలు అందించనున్నారు. ఈ పథకం కింద మురికివాడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారు, అంగన్వాడీ కార్యకర్తలకు ఈ స్కీమ్ కింద సహాయం అందుతుంది.

● అఫర్డబుల్ హౌసింగ్ (ఏహెచ్‌పీ)

ఈ విభాగం కింద రాష్ట్రాలు, నగరాలు, ఇతర ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కొంత వాటా, కేంద్రం నుంచి కొంత వాటా వేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతుల్లో ఇళ్లను నిర్మిస్తారు. వీటిని ప్రధానంగా ఆర్థికంగా బలహీన సమూహాలు (ఈడబ్ల్యూఎస్)లకు అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మాదిరిగానే కొంత మొత్తం చెల్లించి ఈ అపార్టుమెంట్లలో ప్లాట్లను అందజేస్తారు. సరసమైన ధరల్లో అందించేందుకు వీలుగా రిడీమబుల్(వినియోగించుకో తగిన) హౌసింగ్ ఓచర్లను అందుబాటులో ఉంచుతారు.

● వడ్డీ రాయితీ..

ఎంతో కొంత స్థోమత ఉండి ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందేవారిని ఉద్దేశించి ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తెచ్చింది. గరిష్ఠంగా రూ.25 లక్షల రుణం, లేదా రూ.35 లక్షలు ఇంటి విలువ ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకూ ఉన్న ఈడబ్ల్యూఎస్ కుటుంబాలు, 3- 6 లక్షల ఆదాయం ఉన్న ఎల్ఐజీ కుటుంబాలు, 6- 9 లక్షల ఆదాయం ఉన్న ఎంఐజీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వస్తుంది. వీరికి వడ్డీ రాయితీ ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.1.80 వేలు అందజేస్తారు.

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్ ఆశీస్సులు కూడా అప్పారావుకే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాత్రం తన నియోజకవర్గానికి చెందిన మక్కెనను కాదని అప్పారావుకు లేఖ ఇవ్వడం భావ్యం కాదని నిరాకరించినట్లు తెలిసింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తొలుత మక్కెనకే లేఖ ఇచ్చినప్పటికీ అప్పారావుకు కూడా లేఖ ఇస్తూ తన తొలి ప్రాధాన్యం మాత్రం మక్కెనకేనంటూ చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పారావు పేరును అధిష్ఠానం లాంఛనంగా ప్రకటించటం మాత్రమే మిగిలిఉందని చెబుతున్నారు. మక్కెన టీడీపీలో కొత్తగా చేరడం, ఇద్దరూ ఒకేసామాజికవర్గం కావడంతో ఆయన పోటీలో వెనకపడ్డారు. పైగా వినుకొండ ఎమ్మెల్యే జీవీకి ఇటీవల కేబినెట్ మంత్రిగా హోదా ఉన్న చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో అదే నియోజకవర్గానికి చెందిన మక్కెనకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి వరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

'బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని'కి రూ.పది లక్షల విరాళం


చెక్కు అందజేస్తున్న డాక్టర్ కోడెల శివరామకృష్ణ దంపతులు

నరసరావుపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని 'బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని' పథకానికి శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. కోడెల శివప్రసాదరావు తనయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ ఈ విరాళాన్ని అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ విరాళాన్ని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి శుక్రవారం తిరుమలలో అందజేశారు. కోడెల ఆశయాలకు అనుగుణంగా రూ.10 లక్షల విరాళాన్ని పేదల వైద్య సేవలకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

యూజీసీ నిబంధనల ప్రకారమే పదోన్నతులు

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతుల ప్రక్రియ యూజీసీ నిబంధనల ప్రకారమే జరిగాయని యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు పేర్కొన్నారు. యూనివర్సిటీ పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. జీవో 20 ప్రకారం అర్హత కలిగిన వారికే పదోన్నతులు కల్పించినట్లు ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం పరిపాలన సౌలభ్యం, జవాబుదారీతో సాధారణ బదిలీలు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వ రాజకీయ ఒత్తిడుల మూలంగా అవసరానికి మించి తిరుపతిలో ఉన్న సూపరింటెండెంట్లను అంచలవారీగా సవరించుకుంటూ వస్తున్నామని తెలిపారు. ఐఏబీ బిల్డింగ్ నిర్మాణం ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీఐఐసీ నిధులను విడతల వారీగా విశ్వవిద్యాలయం నుంచి నేరుగా విడుదల చేస్తారనీ, రూ.15 కోట్లు నేరుగా డ్రా చేయడం అసాధ్యం అని పేర్కొన్నారు. నిబంధనలు అనుసరించి నిధులన్నీ యూనివర్సిటీ కంట్రోలర్ దగ్గరే ఉంటాయన్నారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో భర్తీ కాకుండా మిగిలిన బీఎస్సీ అగ్రికల్చర్ 140 సీట్లు విశ్వవిద్యాలయ నియమ, నిబంధనలకు అనుగుణంగా భర్తీ చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో పేపర్ లీకేజీ విషయంపై సదరు వ్యక్తిపై శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

వినుకొండటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో రైతుల వద్ద నుంచి వెయ్యి టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమశాతం 17 ఉన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.1740 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌తో కలిసి పట్టణంలోని కారంపూడి రోడ్డులోని శాఖాంబరి రైస్ మిల్లు, ఏనుగుపాలెం రోడ్డులోని మక్కెన రామాంజనేయులు రైస్ మిల్లును తనిఖీచేశారు. తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శ్రీహరి, ఏడీఏ రవిబాబు, ఏవో వరలక్ష్మి, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.


పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన


ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందం దావోస్ పర్యటన విజయవంత మైందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి రావటంతో తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వనరులతో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగం, స్పీడ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాలను సీఎం బృందం కార్పోరేట్ దిగ్గజాలకు వివరించిందన్నారు. ప్రపంచ దేశాల నుంచి దావోస్‌కు వచ్చిన పెట్టుబడి దారులను ఆకట్టుకోవటంతో చంద్రబాబు సంపూర్ణంగా సఫలమయ్యారన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 15 ప్రపంచ అత్యున్నత వాణిజ్య సంస్థల అధిపతులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఇచ్చే ప్రోత్సహకాలను తెలియజేశారన్నారు.

సీఎం దావోస్ పర్యటన విజయవంతం

- కొమ్మాలపాటి శ్రీధర్



గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దావోస్ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచ దేశాలకు చాటడం ద్వారా ఆయన పర్యటన విజయవంతమైందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్‌తో జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో సమావేశమైన చంద్రబాబు స్విస్ కంపెనీలు ఓర్లికాన్, స్విస్ మెన్, అంగ్స్ ఫిష్టర్, స్విస్ టెక్స్‌టైల్స్ సంస్థల సీఈఓలతో ఏపీలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారని తెలిపారు. సీఐఐ నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో పాల్గొని గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై ఎంతో ఆసక్తిదాయకంగా ప్రసంగించి, స్వర్ణాంధ్ర- 2047 విజన్ డాక్యుమెంటులోని 10 మార్గదర్శక సూత్రాలను వివరించారన్నారు. దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేశ్ రాష్ట్రానికి భారీ పరిశ్రమలను ఆహ్వానించి, తద్వారా నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను సాధించాలని అహర్నిశలు కృషి చేశారన్నారు.

దావోస్ పర్యటనతో ప్రగతికి బాటలు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కూడిన బృందం దావోస్ పర్యటన విజయవంతం కావడంపై స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బ్రాండ్ ఏపీని ప్రమోట్ చేయడంతో లక్ష్యం నెరవేరిందని చెప్పారు. ఈ బృందం వేసిన ప్రతి అడుగు రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని అన్నారు. జ్యూరిచ్ విమానాశ్రయంలో అడుగిడింది మొదలు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఆలోచనలను, రాష్ట్రంలోని వనరులు, అవకాశాలకు ముడిపెట్టి ఇచ్చిన వివరణ, సదస్సులో పాల్గొన్న ప్రతి కంపెనీ, ప్రతి సీఈవో ఏపీ గురించి ఆలోచించేలా చేసిందని వివరించారు. ఓ వైపు వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే మరోవైపు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి సన్ రైజ్‌స్టేట్ బ్రాండ్ ను ప్రపంచస్థాయిలో ప్రమోట్ చేయడంలో చంద్రబాబు, లోకేశ్‌ల లక్ష్యం నెరవేరిందని పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలకు భరోసా

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన ద్వారా పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం పెట్టుబడులు పెట్టడానికి పూర్తి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనపై వైసీపీ విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కూడా పూర్తికాక ముందే విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అదాని వద్ద రూ.1872 కోట్ల లంచం తీసుకున్నట్లు అమెరికా కోర్టులో కేసులు నమోదు కావటంతో అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్ పరువు పోగొట్టిన ఘనత జగన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. దావోస్ పెట్టుబడులు ఆకర్షించటానికి ఓ వేదిక అన్నారు. పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతుంది అనటంలో సందేహం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మోడల్ పాఠశాలలు ఏర్పాటుకు కసరత్తు

- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు


పెదమక్కెన పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

సత్తెనపల్లి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలు ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం పెదమక్కెనలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఈ, ఎస్టీ ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఇంగ్లిషులో సంభాషించటం చూసి విద్యార్థులు, ఆ పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?, ఏ స్కూళ్లను అనుసంధానం చేయాలనే వివరాలను డీఈవో చంద్రకళ, గ్రామ సర్పంచిని అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఈ పాఠశాలను గ్రామంలో మోడల్ పాఠశాలగా తయారు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీలో ఒక మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసేలా జాబితాను తయారు చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మండలంలోని పాఠశాలలను తనిఖీ చేశారు. పల్నాడు జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

బాపట్ల వార్తలు

ఏరియా వైద్యశాల 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి

● సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వంద పడకల ఆసుపత్రిగా ఉన్న బాపట్ల ఏరియా వైద్యశాలను 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నట్లు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనిపై గత ఏడాది నవంబరు నెలలో కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించటం జరిగిందన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న క్యాంటీన్, సైకిల్ స్టాండ్‌ను తొలిగించనున్నట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 31 నాటికి వీరికి గడువు ముగిసిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి, విస్తరణ కొరకు కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకొని వీటిని తొలిగించాలని చెప్పటం జరిగిందన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు మార్చి నెలాఖరుకు తొలిగించాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు.

మాస్టర్ ట్రైనర్ శిక్షణ కార్యక్రమం

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా మాస్టర్ ట్రైనర్ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. శిక్షణలో ఆగ్రోఫారెస్ట్రీ పైన అవగాహన కలిగించారు. బీడు భూములను ఉపయోగించి అడవులను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనారాణి, జిల్లా ఫారెస్ట్ అధికారి టి.భీమయ్య, రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎన్.శైలేష్, డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ ప్రసంగించారు.

అద్దేపల్లిలో ఆయుర్వేద వైద్య శిబిరం

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అద్దేపల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అద్దేపల్లి రామాలయం వద్ద కొల్లూరు మండలం క్రాప ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు నాగసుధ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. వారికి అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జితేంద్ర, పద్మశ్రీ, ప్రసాదరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బావిరెడ్డికి సీపీఐ నాయకుల నివాళి

కొల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బావిరెడ్డి వెంకటేశ్వరరావు 40వ వర్ధంతి పురస్కరించుకుని సీపీఐ నాయకులు నివాళులర్పించారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెంలో బావిరెడ్డి స్థూపం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా సభ్యులు ఘంటా రాంబాబు, అమృతలూరు కృపానందం, సనకా అగ్గిరామయ్య నివాళులర్పించి ఆయన పేదల కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ అధ్యక్షుడు మురాల వాసుదేవ్ గౌడ్, అరవ హరిబాబు, బావిరెడ్డి వెంకట్రావు, గాజుల కృష్ణమూర్తి, సమ్మెట వెంకయ్య పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూళ్ళు వేగవంతం చేయాలి : ఈవోపీఆర్డీ

పిట్టలవానిపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీలోని కార్యదర్శులు 2024-2025 సంవత్సరానికి సంబంధించిన ఇంటిపన్నులు, నీటి కుళాయి వసూళ్ళు వేగవంతం చేయాలని మండల పరిషత్ ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.సత్యనారాయణరావు ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల కార్యదర్శులు మార్చి 31వ తేదీలోపు ఇంటిపన్నులు, ఇంటి కుళాయి పన్నుల వసూళ్ళు వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

రేపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలంటూ శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరులో జరిగే రాష్ట్రమహాసభలలో ప్రజాసమస్యల మీద పలు తీర్మానాలు చేయటం రాబోయే కాలంలో రాష్ట్రంలో నిర్వహించే పోరాటాలకు ప్రణాళికలను రూపొందించుకోవటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణ్‌రావు, వై.నవీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎం.శాంతకుమారి శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని పెదపులివర్రు సబ్ స్టేషన్ పరిధిలోని పెసర్లంక-పెదల్లంక గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

వేమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళపై ఆమె బంధువు ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి అత్యాచారం చేశాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వేమూరు ఎస్ఐ రవికృష్ణ శుక్రవారం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గాజుల్లంకకి చెందిన బొమ్మసాని శ్రీనివాసరావు (44) ఈనెల 21న శీతలపానీయం సీసాలో ఉన్న గడ్డి మందును మంచినీరుగా భావించి తాగడంతో అస్వస్థతతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెనాలిలోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు శుక్రవారం తెలిపారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పరిటాల

● మంత్రి అనగాని సత్యప్రసాద్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగించి వారికి అండగా నిలిచి ప్రజల మన్ననలను పొందిన వ్యక్తి పరిటాల రవి అని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్ రోడ్డులలో పరిటాల యువసేన కార్యాలయం వద్ద శుక్రవారం పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పెత్తందారీ వ్యవస్థను రూపుమాపి ప్రజలకు సేవలు అందిస్తూ వారికి అండగా నిలిచారన్నారు. రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి అడుగుజాడల్లో యువత పయనించాలని కోరారు. పరిటాల యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రికార్డు స్థాయిలో 778 మంది రక్తదానం చేసి రికార్డును నెలకొల్పారు. సేకరించిన రక్తనిధిని ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్‌కు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పరిటాల యువసేన అధ్యక్షుడు దండమూడి ధరణికుమార్, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, అజయ్, గోగినేని పట్టాభి రామారావు, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

అమృతలూరులో...

అమృతలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అమృతలూరులో తెలుగుదేశం పార్టీ నాయకుడు, దివంగత పరిటాల రవి వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదల ఆశయాల కోసం పరిటాల చేసిన సేవలను కొనియాడారు. పెత్తందార్లకు అడ్డుకట్ట వేసిన వ్యక్తి పరిటాల అన్నారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లు రామేశం, శివా టెంపుల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



దావోస్ పర్యటన ముగించుకుని ఉండవల్లి నివాసానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కొందరు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో దావోస్ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. - వేమూరు (ఆంధ్రజ్యోతి)

ఆడపిల్లలు సమస్యలు అధిగమించి స్వేచ్ఛగా పెరగాలి



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించి స్వేచ్ఛగా పెరగాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదిన బాలికా దినోత్సవం జరుపుకోవటం జరుగుతుందన్నారు. బిడ్డ, తల్లి గర్భంలో ఉండగానే అక్రమంగా పరీక్షలు చేయించి ఆడ, మగ అని తెలుసుకొని చట్ట వ్యతిరేకంగా అబార్షన్‌లు చేయిస్తున్నారన్నారు. ఆడపిల్ల పుట్టగానే దానికి కారణం తల్లి అని ఆమెను తండ్రి హింసించటం జరుగుతుందన్నారు. ఈ విషయమై అవగాహన సదస్సు ద్వారా సమాజానికి అవగాహన కల్పించాలని శిశు సంక్షేమశాఖాధికారులకు తెలిపారు. 'ఆడపిల్లను రక్షిద్దాం- ఆడపిల్లను చదివిద్దాం' అనే కార్యక్రమం సందర్భంగా సంతకాల సేకరణలో కలెక్టర్ సంతకం చేసి ప్రారంభించారు. శిశు సంక్షేమశాఖ, పాఠశాలల విద్యార్థులకు ఆడపిల్లల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన 120 మందికి కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.ఉమా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి జె.రాజాదెబోరా, బీసీ సంక్షేమశాఖాధికారిణి జీవీ శివలీల, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, సీడీపీవో లక్ష్మీ పార్వతి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో...

జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలలో చదువుతన్న బాలికలకు పుస్తకాలు, పెన్నులు, పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. బాలికలు విద్యను హక్కుగా పొందటం ద్వారానే కుటుంబం, సమాజం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్‌రామ్‌జీ, బాపట్ల జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి కొచ్చెర వినయ్ రాజ్, ప్రధానోపాధ్యాయులు నున్నం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు సయ్యద్ షాజియా, జి.శిరీషా, కాగిత సుందరదాసు తదితరులు పాల్గొన్నారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో...

రేపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలు మారుతున్న కాలానుగుణంగా అన్నిరంగాల్లో రాణిస్తూ ముందుండాలని రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్రకుమార్ అధ్యక్షతన శుక్రవారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ అవర్ణ మాట్లాడుతూ పురుషులకు ధీటుగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, మహిళా సాధికారిత విభాగం సభ్యులు ఎన్.సుభాషిణి, ఐక్య కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.నరసయ్య, కరిముల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపట్ల కాలేజ ఆఫ్ ఫార్మసీలో....

బాపట్లరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి అన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా బాపట్ల జిల్లా కోర్టు న్యాయవాది కత్తి నాగలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. అన్ని రంగాలలో తమవంతు పాత్రపోషించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శిశు సంక్షేమ, మహిళా సాధికారిత దిశగా బలంగా అడుగులు పడాలని అభిలాషించారు. సమాజంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళా శక్తి అభ్యుదయానికి తోడ్పడాలని చట్టవిరుద్ధమైన బాల్య వివాహాలు, శిశు మరణాలు వంటి నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలిక విద్యతో అసమానతలు లేని సమాజం సాధ్యపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాది కత్తి నాగలక్ష్మిని కళాశాల అధ్యాపకులు దుశ్శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు, విద్యార్థినులకు శుభాకాంక్షలను తెలిపారు.

అనంతవరం జడ్పీహెచ్‌ఎస్‌లో...

కొల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమృతలూరు ప్రాజెక్టు అధికారి జి.విజయలక్ష్మి పాల్గొని కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్, బ్యాడ్ టచ్‌లు, బాల్య వివాహాలు, లింగ వివక్ష, మహిళా సాధికారత, బాలికల అక్రమ రవాణా అంశాలపై బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, శివనాగిని, సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి, ఏఎన్‌ఎం కుమారి, విజయ, అంగన్‌వాడీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



న్యాయవాది కత్తి నాగలక్ష్మిని సన్మానిస్తున్న బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మశీ అధ్యాపకులు



సమావేశంలో పాల్గొన్న రేపల్లెరెడ్‌క్రాస్‌సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య

ఘనంగా ఏజెంట్స్ వృత్తి పరిరక్షణ దినోత్సవం

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం ఏజెంట్స్ వృత్తి పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏజెంట్ యూనియన్ 1964 అధ్యక్షుడు జయం వరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత అసోసియేట్ డీన్ డాక్టర్ రావూరి వీరరాఘవయ్య పాల్గొని ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్‌పై అవగాహన పెంచి వారికి ఆర్థిక భద్రత కల్పించాలన్నారు. ఎల్ఐసి ప్రపంచంలోనే 4వ అతి పెద్ద ఆర్థిక సంస్థగా ఉందంటే ఏజెంట్‌ల కృషియేనని కొనియాడారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏజెంట్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జి.గోపాలరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సుమన్, సెక్రటరి జె.కృష్ణ, కోశాధికారి గౌరిశంకర్, డివిజన్ ఉపాధ్యక్షుడు బొమ్మనబోయన సాంబయ్య, డివిజన్ జాయింట్ సెక్రటరి రాజేష్, వల్లు శ్రీను, ఎం.శ్రీను, కొల్లా శ్రీనివాసరావు, ఇక్కుర్తి శ్రీనివాసరావు, వీరాస్వామి, ఎస్.శ్రీను, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో పోషక పదార్థాల ప్రదర్శన

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నారాయణ స్కూల్‌లో శుక్రవారం పోషక పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసి తీసుకొచ్చిన వంటకాలను ప్రదర్శనలో ఉంచి ఉపాధ్యాయులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యరాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏవో సాంబశివరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద మహిళకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా నిరుపేద ముస్లింలను గుర్తించి ప్రతి శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా అన్నారు. కర్లపాలెంలోని నిరుపేద మహిళకు శుక్రవారం బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జానీబాషా, షేక్ హబీబ్, షేక్ రియాజ్‌బేగ్, షేక్ బహదూర్ బాషా, షేక్ మహబూబ్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పనుల గుర్తింపుపై సిబ్బందికి శిక్షణ

● విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించేందుకు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు తెలిపారు. విస్తరణ శిక్షణా కేంద్రంలో 756 మందికి ఆర్థిక సంవత్సరంలో పనులు గుర్తించటం గురించి వివరించటం జరిగిందన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో ఈ విధంగా శిక్షణ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బాపట్ల, కాళహస్తి, అనంతపురం లో ఒకేసారి శిక్షణ ప్రారంభించారన్నారు. రాష్ట్ర స్థాయి సామర్థ్య పెంపుదల శిక్షణా విభాగం పర్యవేక్షకులు కె.స్వరూపరాణి, ఆంధ్రప్రదేశ్ కమిషనర్ కార్యాలయాధికారి జెవి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి పూర్వ విద్యార్థుల విరాళం

అమృతలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి 1982-83వ సంవత్సర పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. రూ.3 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ పనుల నిమిత్తం శుక్రవారం ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ వినయబాబు, ఘైనేని రత్నప్రసాద్, అంబటి రామ్మోహనరావు, హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు, పూర్వ విద్యార్థులు మాజేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆదినారాయణ, ఆనంద్, గిరి, మధు, పోతురాజు, శాంతి, అనూరాధ, సూర్యశ్రీ, రత్నకుమారి తదితరులు పాలొన్నారు.

లేఅవుట్‌లో పనులు నిలిపివేయాలి : తహసీల్దారు

కొల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్‌కు సంబంధించిన అనుమతులు వచ్చే వరకు పనులు నిలిపి వేయాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం కొల్లూరు శివారులో 90 సెంట్ల వ్యవసాయ భూమిలో అనుమతులు లేకుండా లేఅవుట్ పనులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దృష్టికి రావడంతో ఆయన సిబ్బందితో లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సదరు భూమి వ్యవసాయేతర భూమిగా మార్పిడి కాలేదని, సీఆర్‌డీఏ అనుమతులు లేవని గుర్తించారు. గురువారం సీఆర్‌డీఏకు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు, శుక్రవారం వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేసి నగదు చెల్లింపులు జరిపినట్లు నిర్వాహకులు తహసీల్దార్‌కు తెలిపారు. పూర్తి స్థాయి అనుమతులు వచ్చే వరకు లేఅవుట్‌లో ఎటువంటి పనులు చేయరాదని నిర్వాహకులకు తహసీల్దార్ తెలియజేసి పనులను నిలుపుదల చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

కర్లపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నుంచి కర్లపాలెం వైపు వస్తున్న ఓ ప్రైవేట్ కళాశాల బస్సు రెండు ద్విచక్రవాహనాలను ఒక కూరగాయల బండిని ఢీకొట్టటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బస్సు నందిరాజుతోట వద్ద కూరగాయల బండిని, హైదర్‌పేట వద్ద బైక్‌ను, సత్యవతిపేట వద్ద స్కూటీని ఢీకొట్టింది. గ్రామస్థులు చొరవ తీసుకొని బస్సును నిలుపుదల చేశారు. కూరగాయల బండి వ్యాపారి కె.శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిహామీపై కలెక్టర్ ఆదేశాలు హర్షణీయం

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై కలెక్టర్ ఆదేశాలు హర్షణీయమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకట్రావు అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించాలని సంఘనాయకులు కలెక్టర్‌ను కోరిన వెంటనే అధికారులను ఆదేశించి లక్ష్యాలు నిర్దేశించటం శుభపరిణామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం తరుపున కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

వేమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన దండే వెంకట్రామయ్య, వేమూరు గ్రామానికి చెందిన కైతేపల్లి అశోక్‌కుమార్‌లు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స నిమిత్తంగా అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించి సహకరించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును లిఖితపూర్వకంగా కోరారు. ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నిమిత్తంగా సిఫారసు చేశారు. దండే వెంకట్రామయ్యకు రూ.46,800, కైతేపల్లి అశోక్‌కుమార్‌కు రూ.38,500 మంజూరు కాగా ఎమ్మెల్యే ఆనందబాబు అందజేశారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, బీసీ సంఘం నేత శివకృష్ణ పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు : కమిషనర్

రేపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించి దోమల నివారణను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం డ్రైడే సందర్భంగా దోమల నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 నుంచి 22 వార్డుల్లో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మురుగుకాల్వల్లో యాంటీలార్వా ఆయిల్ చల్లటం వంటి కార్యక్రమాలు చేశామన్నారు. నీటికుంటల్లో ఆయిల్‌బాల్ వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య, సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య, కె.శ్రీనివాసరావు, వెంకటప్రసాద్, బ్రహ్మయ్య, శానిటరీ సెక్రటరీలు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



దోమల నివారణ కోసం ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రైతుల హృదయాల్లో వీరయ్యచౌదరిది సుస్థిరస్థానం



వీరయ్యచౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంగం డెయిరీ సిబ్బంది

రేపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైతుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని వీరయ్యచౌదరి సంపాదించుకున్నారని సంగం డెయిరీ రేపల్లె ఏరియా మేనేజర్ గోపీకృష్ణ అన్నారు. స్థానిక సంగం డెయిరీ కార్యాలయంలో శుక్రవారం సంగం డెయిరీ మాజీ చైర్మన్, రెవెన్యూశాఖా శుక్రవారం మంత్రి దివంగత ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని పాడి రైతులకు అండగా నిలిచి వారిని ఆర్థికంగా బలపడేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ సిబ్బంది డాక్టర్ దినేష్, డాక్టర్ రాకేష్, గోపి, చెన్నకేశవరావు, వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, శ్రీధర్, పాల ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

● అప్పికట్ల (బాపట్ల), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి, క్షీరవిప్లవ సారధి ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం అప్పికట్ల చిల్లింగ్ సెంటర్‌లో నిర్వహించారు. వీరయ్యచౌదరి పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆలోచన విధానాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ టి.వీరేంద్రకుమార్, ఎంసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● జనసేన మహిళా విభాగం జిల్లా కార్యదర్శి అనూరాధ

కుచ్చళ్లపాడు (వేమూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వం గ్రామ గ్రామాన పశు వైద్య శిబిర కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషమని, ఈ సౌకర్యాన్ని పశు పోషక రైతులు వినియోగించుకోవాలని జనసేన పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సోమరౌతు అనూరాధ అన్నారు. నియోజకవర్గంలోని బలిజేపల్లి, రావికంపాడు, పెదలంక, వేటపాలెం, కుచ్చెళ్లపాడు గ్రామాలలో శుక్రవారం పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు పర్యవేక్షణలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేశారు. పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కుచ్చెళ్లపాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అనూరాధ చేతుల మీదుగా రైతులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ వైద్యులు, అసిస్టెంటు సర్జన్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కుచ్చెళ్లపాడులో పశు పోషక రైతులకు మందులు సరఫరా చేస్తున్న జనసేన జిల్లా కార్యదర్శి అనూరాధ

బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకావిష్కరణ

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగ ప్రవేశిక లక్ష్యాలు అర్థమయ్యే విధంగా చిత్రాలతో రూపొందించిన పుస్తకాన్ని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగ ప్రవేశికలో పొందు పరిచిన పదాల అర్థాలు తెలియజేసే విధంగా బొమ్మలతో రూపొందించిన పుస్తకం అద్భుతంగా ఉందన్నారు. దీనికి కృషి చేసిన డీబీఆర్‌సీ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ప్రకాశరావు, డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్‌దాసు, ప్రకాశరావు, డానీ, ఎన్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు


బాలికలతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యా బుద్ధులు, ఇతర సౌకర్యాలపై హాస్టల్ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధతో మెలగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం చీరాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈక్రమంలో వంట గది, పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరిశుభ్రంగా ఉండటం వలన విష సర్పాలు వంటివి చేరితే చిన్నారుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి ఉత్సాహపరిచారు. అలాగే చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంత్రి వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సోషల్ వెల్ఫేర్ అధికారిణి రాజా దెబోరా, డీటీలు అర్జున్, మహేష్ తదితరులు ఉన్నారు.


ధర్మవరం గ్రామంలో పశు యజమానులతో మాట్లాడుతున్న ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగపర్చుకుని పాడి పరిశ్రమను మరింతగా పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏపీఎల్‌డీఏ) సీఈవో డాక్టర్ యం. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం అద్దంకి మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగిన పశు ఆరోగ్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం వద్దకు వచ్చిన పశువుల యజమానులతో ఆ యన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ యం. మోహనరావు, డాక్టర్ ఇ. అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

బల్లికురవ : పాడిపరిశ్రమను వృద్ధిలోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పశువైద్యాధికారులు పావనీకుమారి, మహేశ్వరరావులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా రెండు గ్రామాల్లోని 62 దూడలకు, 62 గేదెలకు, 1,300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందించారు.

ఫ్లోరిన్‌భూతాన్ని తరిమి కొడదాం

బల్లికురవ. జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరీన్ భూతాన్ని తరిమి కొట్టేందుకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా ఫ్లోరోసిస్ టీం అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం నక్కబొక్కలపాడు, వెలమవారిపాలెం గ్రామాలలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాలలో ప్రజలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భారతి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మాంసాహార దుకాణాలు తెరిస్తే చర్యలు

అద్దంకి, జనవరి24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని మాంసాహార దుకాణాలు తెరిసినా, అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలుంటాయన్నారు.

నేడు నేషనల్ ఓటర్స్ డే

నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు.

పాఠశాలలకు బిస్కెట్ ప్యాకెట్ల అందజేత

పంగులూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ శుక్రవారం బిస్కెట్ ప్యాకెట్‌లు సమకూర్చారు. మండలంలోని పాఠశాల బాల బాలికలకు నాలుగేళ్లుగా బిస్కెట్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 44 పాఠశాలలకు స్వయంగా వెళ్లి అందులో చదువుతున్న 3,372 మంది విద్యార్థులకు సరిపడా బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.

రామకూరు కొండపై నాగ సాధువులు

మండలంలోని రామకూరు గ్రామంలో కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నాగ సాధువులు శుక్రవారం సందర్శించారు. ఉదయం సమయంలో ఆలయానికి చేరుకున్న నాగ సాధువులు స్వామి వారిని దర్శించుకుని అర్చన, అభిషేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాశీ నుంచి బయలుదేరామని, ప్రయాణ మార్గంలో పలు ఆలయాలను సందర్శిస్తూ స్వామి వారిని దర్శించుకుంటూ తమిళనాడులోని రామేశ్వరం వెళుతున్నట్లు తెలిపారు.

ఐసీఎంఆర్ ఫెలోషిప్‌కు రిమ్స్ వైద్య విద్యార్థినుల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీలోని ఇరువురు వైద్య విద్యార్థినులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లో రెండు ఫెలోషిప్‌లు సాధించి సత్తా చాటారు. మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కె.వైష్ణవి, జి.తారాలీశ్రీలు డాక్టర్ భాస్కర్ కొల్లి, డాక్టర్ స్పందనల గైడెన్స్‌లో ఒంగోలు నగరంలోని పేదవారిలో ప్రీ స్కూలు పిల్లల కోసం విటమిన్ ఎ సప్లిమెంటేషన్‌పై అడ్డంకులు, సులభతరం అంశంపై సెక్షనల్ స్టడీ చేశారు. దక్షిణ భారత దేశంలోని ఒక జిల్లాలోని వికలాంగత కలిగిన గిరిజన పిల్లల జీవన నాణ్యత, వారి కుటుంబాలపై భారం అనే అంశాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక రిమ్స్‌లో మెడికల్ విద్యార్థినలుఉ వైష్ణవి, తారాలిశ్రీని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, ప్రొఫెసర్లు ప్రత్యేకంగా అభినందించారు.

పర్చూరులో ఇంటింటా సర్వే

నిరుద్యోగులకు ఉద్యోగకల్పన
పదివేల ఉద్యోగాలే టార్గెట్
ఎమ్మెల్యే ఏలూరి సరికొత్త ప్రయత్నం
నేడు రెండవ విడత జాబ్‌మేళా



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా వినూత్న విధానానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శ్రీకారం పలికారు. ఉద్యోగం అంటే ఐటీ ఉద్యోగమే అన్న చందంగా మారిన ఈ తరుణంలో అన్నీ స్థాయిల్లోని విద్యాధికులకు ఉద్యోగం కల్పించే ఉద్దేశంతో ముందడుగు వేస్తున్నారు. అందు కోసం జాబ్ మేళా పేరుతో రండి అహో అని పిలవకుండా నిరుద్యోగులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. తదనుగుణంగా గుర్తించిన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా స్థాయిల్లోని పారిశ్రామిక కంపెనీలను నియోజకవర్గానికి రప్పిస్తున్నారు. ఇందుకోసం తాను ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌తో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించటంలో అపార అనుభవం గల సంస్థను కలిపి కార్యక్రమానికి శ్రీకారం పలికారు. అందులో భాగంగా మలివిడత జాబ్ మేళా కార్యక్రమాన్ని శనివారం మార్టూరు సమీపంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

వ్యవసాయం, సముద్ర తీరప్రాంత వృత్తులే ప్రధానమైన పర్చూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి జరగని విషయం తెలిసిందే. గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు వచ్చినా విద్యాధికులైన నిరుద్యోగులకు పెద్దగా ఉద్యోగాలు లభించటం లేదు. ఇక ఐటీ ఉద్యోగాల పేరుతో విదేశాలకు ఆ నియోజకవర్గం నుంచి భారీగానే తరలి వెళ్లినా ప్రస్తుతం ఆ ఉద్యోగాల పరిస్థితి గగనంగా మారింది. పారిశ్రామిక అభివృద్ధి లేకపోవటంతో క్రిందిస్థాయి విద్యాధికులకు ఉద్యోగాలు లభించటం గగనం అయింది. పరిస్థితి గుర్తించిన ఎమ్మెల్యే ఏలూరి తాను కొత్తగా ఏర్పాటు చేసిన గ్రీన్స్ స్పార్క్ ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల కార్యక్రమాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భావించారు. తదనుగుణంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విభాగంలో మంచి అనుభవం గల హెచ్ఆర్‌కో కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ఆ కంపెనీని రంగంలోకి దించారు. జాబ్ మేళా పేరుతో నిరుద్యోగులను ఆహ్వానించకుండా వయందుగా నిరుద్యోగు లను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా హెచ్ఆర్‌కో కంపెనీ సిబ్బంది ప్రతి గ్రామం వెళ్లారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లో చదువుకున్న నిరుద్యోగులను గుర్తిస్తున్నారు. ఐటీ ఉద్యోగాలకు ఉపయోగపడే ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ చదువుకున్న వారికి, అలాగే ఫార్మసీ విద్యను అభ్యసించిన వారికి మాత్రమే పరిమితం కావటం లేదు. పదవ తరగతి నుంచి పీజీ దాక చదువుకున్న నిరుద్యోగులను కూడా గుర్తిస్తున్నారు. అలా గ్రామం యూనిట్‌గా ఆయాస్థాయి విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగుల జాబితా తయారు చేస్తున్నారు. అలా తొలి విడతగా నియోజకవర్గంలోని మండలానికి ఒకటి రెండు గ్రామాలను ఎంపిక చేసుకొని నిరుద్యోగులను గుర్తించారు.

ఇలా గుర్తించిన నిరుద్యోగుల్లో వారి వారి విద్యార్హతలను బట్టి నెల వారీ రూ. 10 వేల నుంచి రూ.70 వేల వరకు జీతభత్యాలు ఇప్పించే విధంగా ఉద్యోగాలు ఇప్పించాలని నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగా ఆయా

రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు

స్థాయి అర్హతలు ఉన్నవారికి ముందుగానే ఎలాంటి ఉద్యోగం, ఏ స్థాయిలో జీతం రావచ్చో వివరించి అందుకు సిద్ధపడిన వారి పేర్లు మాత్రమే నమోదు చేసుకుంటున్నారు.

నేడు మలివిడత

కాగా సేవా కార్యక్రమాల నిర్వాహణతో తన జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే చేయూత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మలివిడత జాబ్ మేళా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి గుర్తించిన పదవ తరగతి నుంచి ఆపై స్థాయిలో విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులకు ఆహ్వానం పంపారు. ఈ నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని దేశంలోని వివిధ ప్రాంతాలు ప్రధానంగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎనిమిది పెద్ద పారిశ్రామిక కంపెనీలను రప్పిస్తున్నారు. ఆయా స్థాయిలో అన్నీ ఉద్యోగాలకు ఈ క్యాంపులో నిరుద్యోలను ఎంపిక చేస్తారు. దీంతో శనివారం జరిగే క్యాంపులో నిర్వహించే ఫలితాలపై యావత్తు ప్రజానీకం ఆశక్తిగా ఎదురుచూస్తోంది. కాగా నియోజకవర్గంలో రానున్న నాలుగున్నర సంవత్సరాల్లో పదివేల మంది నిరుద్యోలకు ఉద్యోగాలు కల్పించటమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి ప్రణాళిక రూపొందించుకున్నారని అందుకు అవసరమైన సహకారం తాము ఇవ్వబోతున్నామని హెచ్ఆర్‌కో కంపెనీ ప్రతినిధులు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు

గుర్తించిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే ఏలూరి నేరుగా కొన్ని పారిశ్రామిక కంపెనీలతో మాట్లాడగా, హెచ్ఆర్‌కో కంపెనీ వారు మరికొన్ని కంపెనీలతో మాట్లాడి అక్కడి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇప్పించేలా ఒప్పందాలు చేసుకున్నారు. అందులో భాగంగా తొలివిడతగా గుర్తించిన 250 మంది నిరుద్యోగులను ఆహ్వానించి ఆరు రోజుల క్రితం ఒక జాబ్ మేళా నిర్వహించారు. సదరు హెచ్ఆర్‌కో కంపెనీ టెక్ మహేంద్ర వారిని పిలిపించగా ఎమ్మెల్యే ఏలూరి చొరవతో అమెరికాలో ఉంటూ ఇండియాలో కూడా ఐటీ కంపెనీ నిర్వహిస్తున్న ఒక కంపెనీకి తనకున్న పరిచయంతో పిలిపించారు. ఆ కంపెనీ అధినేత వెంకట్ నేరుగా జాబ్ మేళాకు హాజరయ్యారు. మొత్తం 250 మంది నిరుద్యోగులను ఆహ్వానించారు.

కాగా 300 మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. టెక్ మహేంద్ర కంపెనీ నాన్ ఐటీ ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తొలి విడతగా సుమారు 50 మందికి అంగీకార పత్రం ఇచ్చారు. అందులో రూ.10 వేల నుంచి రూ.45 వేల వరకు నెలవారీ జీతం వచ్చే ఉద్యోగాలకు ఆఫర్ లెటర్ ఇచ్చారు. తన కంపెనీలో ఆరు మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు వెంకట్ అక్కడికక్కడే అంగీకార పత్రాలు అందజేశారు వారిలో నలుగురికి తన కంపెనీలో ఢిల్లీలో పనిచేసే అవకాశం కల్పించారు.

యువత చేతిలోనే కళల భవిత

● సందేశాత్మకంగా కమనీయం నాటిక ● అలరించిన మహిళల కోలాటం ● ఉత్సాహంగా ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలు

కోలాట ప్రదర్శన



కమనీయం నాటకం

ఒంగోలు కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 25వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు వివిధ వైవిధ్య భరితమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి కళాపరిషత్ వేదికలపై వివిధ కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మొదటిగా పాకలకు చెందిన శ్రీలక్ష్మి తిరుపతమ్మతల్లి నాదస్వర బృందంచే నాదస్వర కచ్చేరి జరిగింది. ఇందులో కొత్తకోట శ్రీనివాసరావు, బోయినపల్లి సుబ్బారావు, కొత్తకోట వెంకట్రావు, వల్లూరి మోహనరావులు నాదస్వరం, డోలుపై చక్కటి శాస్త్రీయ గీతాలను వినిపించారు.

అనంతరం అల్లూరుకు చెందిన మైత్రి కోలాట బృందంచే ప్రదర్శితమైన కోలాట ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. సుమారు 70 మంది మహిళలు ఈ కోలాటంలో పాల్గొనగా శిక్షకులు నాంచారయ్య ఆధ్వర్యంలో శివ శివమూర్తివి గణనాథ, యశోదమ్మ నీకొడుకు ఏడీ, గున్నగున్న మామిడి, నల్లనయ్యా రావా వంటి పలు గీతాలకు మహిళలు ఉత్సాహంగా కోలాటాన్ని ప్రదర్శించారు. ఇక మహిళలు అందరూ చీపుర్లు పట్టుకుని స్వచ్ఛభారత్ సందేశాన్నిస్తూ చేసిన కోలాట ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. ఇక ప్రతిరోజు నిర్వహించే చర్చాగోష్టిలో భాగంగా మూఢనమ్మకాలు, జాతకాలు, శకునాలు వంటి అంశాలపై చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు.

'కమనీయం'గా..

ఇక నాటకం విషయానికి వస్తే కళలు రాబోయే తరానికి అంది కలకాలం వర్ధిల్లాలంటే యువత చదువుతో పాటు ఏదో ఒక కళలో నైపుణ్యం సాధించాలని, అందుకు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలనే సందేశంతో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారు ప్రదర్శించిన కమనీయం సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్యాధర్ మునిపల్లె రచించిన ఈ నాటికకు బసవరాజు జైశంకర్ దర్శకత్వం వహించగా ఆయనతో పాటు టి.వేణుగోపాల్, గుడివాడ లహరి ప్రధాన పాత్రలు పోషించారు.

శ్రీశంకర విజయం నృత్యరూపకం

ఒంగోలు నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ వారు ప్రదర్శించిన శ్రీశంకర విజయం నృత్యరూపకం సైతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కూచిపూడి నృత్య శిక్షకురాలు పి.శివకుమారి నేతృత్వంలో నృత్య కళాకారులు శంకరాచార్యుల వారి జీవిత గాధను చక్కగా ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పర్యవేక్షించగా, ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తదితరులు పాల్గొని కళాకారులకు ప్రదర్శనా పారితోషికం, జ్ఞాపికలను బహూకరించి సత్కరించారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో

పొదిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని మండలంలోని సల్లూరు గ్రామస్థులు శుక్రవారం పొదిలి పోలీస్‌స్టేషన్ ఎదుటరోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. ఏలూరు పంచాయతీ పరిధిలోని సల్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (45) ఇటీవల అనారోగ్య కారణాలతో విజయవాడలో మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామం సల్లూరుకు తీసుకొచ్చారు. ఈ తరుణంలో గ్రామానికి వేరే సామాజిక వర్గంవారు గ్రామంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయడానికి వీలు లేదంటూ ఘర్షణ పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చారు. వారి చొరవతో శుక్రవారం వేకువజామున అంత్యక్రియలు నిర్వహించారు. అయితే గురువారం రాత్రి అంత్యక్రియలు చేయడానికి వచ్చిన వర్గంపై పొదిలి సీఐ, ఎస్‌ఐలు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ ఆ వర్గంవారు ధర్నా, రాస్తారోకో చేశారు.


నిరసన తెలుపుతున్న బీసీవైపీ వ్యవస్థాపకుడు రామచంద్రయాదవ్‌కు సర్దిచెబుతున్న పోలీసులు

అంతకు ముందు బీసీవైపీ రాష్ట్ర వ్యవస్థాపకుడు బోడె రామచంద్రయాదవ్ సల్లూరు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే మృతదేహానికి దహన సంస్కారాల విషయంలో జరిగిన వివాదాన్ని తెలుసుకొన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్‌ఐ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పొదిలి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రోడ్డుపై కూర్చున్నవారికి పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సల్లూరు గ్రామస్థులకు, పోలీసులకు కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులపై ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రామచంద్రయాదవ్ చెప్పారు. గ్రామస్థులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమించారు.


బల్లికురవలో శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో దట్టమైన మంచును చీల్చుకొని వస్తున్న సూర్యుడు

మంచు తెరలను చీల్చుకుంటూ..

బల్లికురవ. జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వారం రోజుల నుంచి గ్రామాలలో పొగ మంచుతో ఉదయం 10 గంటల వరకు కూడా దట్టమైన మంచు పడుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బల్లికురవ మండలంలో చీకట్లు గొలిపే వాతావరణంలో మంచును దాటుకొని సూర్యుడి భగ భగలు ప్రజలను ఆకట్టుకొన్నాయి. పనులకు వెళ్లే రోజు వారీ కూలీలు సైతం సూర్యుడి వెలుగుల కోసం ఎదురు చూపులు చేశారు. ఆకాశంలో ఒక పక్క మంచు మరో పక్క సూర్యుడు భగ భగలు కనువిందు చేశాయి.

పేదింటికి.. చేయూత

(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్లు అందజేసింది. పీఎంఏవై(గ్రామీణ) కింద గ్రామీణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి చేయూత ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 2.95 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా అర్హులైన పేదల కోసం సర్వే చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఒక విభాగంగా గుర్తించి వారికి సొంత ఇల్లు అందుబాటులోకి తేవడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తుంది. లేనివారికి స్థలం అందజేసి అందులో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే చూసుకుంటోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక విధాన ప్రకటన చేసింది. పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ) కింద వీరికి ఇప్పటి వరకూ కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహాయం కూడా రెట్టింపు కానుంది. ఇప్పటి వరకూ ఇచ్చే రూ.1.50 లక్షల సాయాన్ని ఇక నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఈ మొత్తంలో కేంద్రం వాటాలో ఎలాంటి మార్పు లేదు. గతంలో మాదిరిగా కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా, అదనంగా ఇచ్చే రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా ఉంటుందని సమాచారం. దీంతోపాటు స్వచ్ఛ భారత్ స్కీమ్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, నరేగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.27 వేలు అందించనున్నారు. ఈ పథకం కింద మురికివాడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారు, అంగన్వాడీ కార్యకర్తలకు ఈ స్కీమ్ కింద సహాయం అందుతుంది.

● అఫర్డబుల్ హౌసింగ్ (ఏహెచ్‌పీ)

ఈ విభాగం కింద రాష్ట్రాలు, నగరాలు, ఇతర ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కొంత వాటా, కేంద్రం నుంచి కొంత వాటా వేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతుల్లో ఇళ్లను నిర్మిస్తారు. వీటిని ప్రధానంగా ఆర్థికంగా బలహీన సమూహాలు (ఈడబ్ల్యూఎస్)లకు అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మాదిరిగానే కొంత మొత్తం చెల్లించి ఈ అపార్టుమెంట్లలో ప్లాట్లను అందజేస్తారు. వీటిని సరసమైన ధరల్లో అందించేందుకు వీలుగా రిడీమబుల్(వినియోగించుకో తగిన) హౌసింగ్ ఓచర్లను అందుబాటులో ఉంచుతారు.

● వడ్డీ రాయితీ..

ఎంతో కొంత స్థోమత ఉండి ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందేవారిని ఉద్దేశించి ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తెచ్చింది. గరిష్ఠంగా రూ.25 లక్షల రుణం, లేదా రూ.35 లక్షలు ఇంటి విలువ ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకూ ఉన్న ఈడబ్ల్యూఎస్ కుటుంబాలు, 3- 6 లక్షల ఆదాయం ఉన్న ఎల్ఐజీ కుటుంబాలు, 6- 9 లక్షల ఆదాయం ఉన్న ఎంఐజీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వస్తుంది. వీరికి వడ్డీ రాయితీ ఐదేళ్ల పాటు గరిష్ఠంగా రూ.1.80 వేలు అందజేస్తారు.

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్ ఆశీస్సులు కూడా అప్పారావుకే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాత్రం తన నియోజకవర్గానికి చెందిన మక్కెనను కాదని అప్పారావుకు లేఖ ఇవ్వడం భావ్యం కాదని నిరాకరించినట్లు తెలిసింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తొలుత మక్కెనకే లేఖ ఇచ్చినప్పటికీ అప్పారావుకు కూడా లేఖ ఇస్తూ తన తొలి ప్రాధాన్యం మాత్రం మక్కెనకేనంటూ చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పారావు పేరును అధిష్ఠానం లాంఛనంగా ప్రకటించటం మాత్రమే మిగిలిఉందని చెబుతున్నారు. మక్కెన టీడీపీలో కొత్తగా చేరడం, ఇద్దరూ ఒకేసామాజికవర్గం కావడంతో ఆయన పోటీలో వెనకపడ్డారు. పైగా వినుకొండ ఎమ్మెల్యే జీవీకి ఇటీవల కేబినెట్ మంత్రిగా హోదా ఉన్న చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో అదే నియోజకవర్గానికి చెందిన మక్కెనకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి వరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

ఒకే రోజు 7వేలకుపైగా ఇంకుడు గుంతలు

ఒంగోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఒకే రోజున ఏడువేలకుపైగా ఇంకుడు గుంటలు తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ చెప్పారు. ఈనెలాఖరులోనే ఆ కార్యక్రమం చేపట్టాలని అందుకు వీలుగా గ్రామ యూనిట్‌గా కార్యచరణ రూపొందించాలని ఎంపీడీవోలు, ఏపీవోలకు సూచించారు. ఆ మేరకు శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు ఇచ్చారు. నెలాఖరులో ఒకే రోజు అన్ని పంచాయతీల్లో ఇంకుడు గుంతలు తవ్వేలా చర్యలు తీసుకోవాలన్న ఆలోచనకు కలెక్టర్ రావడంతో తదనుగుణ చర్యలను ఆయన వివరించారు. జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కొక్క పంచాయతీలో కనీసం 10 ఇంకుడు గుంటల వంతున ఒకే రోజు 7,290 తవ్వకాలు చేసేలా ప్రజలను సన్నద్ధం చేయాలని సూచించారు. ఒక్కొక్క దానికి ఉపాధి పథకం ద్వారా రూ.6వేలు ఇవ్వనుండగా లబ్ధిదారుల ఎంపిక తక్షణం చేయాలని తెలిపారు. అలాగే జిల్లాలో చేపట్టిన మినీగోకులాల నిర్మాణాలు నెలాఖరు నాటికి పూర్తిచేయాలని మండల అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,131 మినీ గోకులాలు నిర్మాణం చేపట్టగా సుమారు 570 వరకు పూర్తయ్యాయని, మరో 130 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా దశల్లో ఉన్నవాటితోపాటు ఇతర వాటిని కూడా నెలాఖరులోగా పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇక సోషల్ ఆడిట్ లో గుర్తించిన లోటుపాట్లకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి ఆయా మొత్తాల రికవరీపై దృష్టిసారించాలని మండలస్థాయి అధికారులను పీడీ ఆదేశించారు.

అవీ..ఇవీ



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు, ప్రతినిధులు

చేనేత కార్మికుల నిరసన ర్యాలీ

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేనేత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని శుక్రవారం పట్టణంలో చేనేత కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేతలు అధిక సంఖ్యలో ఉన్నట్లు వివరించారు. ధరల కారణంగా మాస్టర్ వీవర్స్ వద్ద నిల్వలు పేరుకుపోయినట్లు చెప్పారు. అలాగే 200యూనిట్స్ ఉచిత విద్యుత్ అమలు చేయాలని అన్నారు. ర్యాలీగా పట్టణంలో జౌళిశాఖ కార్యాలయం వరకు చేరుకుని నినాదాలు చేశారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, సీఐటీయూ ప్రతినిధులు గంగయ్య, ఎన్. బాబూరావు, గాదె హేమసుందర్, సత్యనారాయణ, కొండయ్య, రాధ, నాగమల్లేశ్వరరావు, రాఘవయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.


కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా తయారు చేయాలి

బల్లికురవ. జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో నూతన మెనును అమలులోకి తెచ్చిందని విద్యార్థులందరూ తినేలా రుచిగా తయారు చేయాలని చీరాల డిప్యూటీ డీఈవో అబ్బరాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. ఈ తనిఖీలో హెచ్ఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి బాలమ్మ

విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలి

● నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి బాలమ్మ

అద్దంకిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హాజరు పట్టీలో ఉన్న విధంగా విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలని జడ్పీ డిప్యూటీ సీఈవో, అద్దంకి నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి బాలమ్మ అన్నారు. శుక్రవారం అద్దంకి మండలంలోని కోటికలపూడి , శ్రీరామ్‌నగర్ కాలని, మోదేపల్లి, తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్‌తో పాటు, పట్టణంలోని పసుమర్తిపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థులకు, హాజరైన విద్యార్థులకు మధ్య వ్యత్యాసం ఉండటాన్ని గమనించారు. స్కూలుకు రాని విద్యార్థుల గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులందరు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో బత్తిన సింగయ్య, ఎంఈవోలు గంగాధరరావు, సుధాకరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న పోతురాజు

జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి

ఇంకొల్లు,జనవరి 24,(ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులైన డ్వాక్రామహిళలు సమాజంలో ఆర్థిక, సైబర్‌మోసాలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని వయోజన విద్యా పర్యవేక్షకులు టి.పోతురాజు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో డిజిటల్,ఆర్థిక, క్రియాత్మక అక్షరాస్యతపై మండలంలోని వివిధ గ్రామాల వీవోఏలు, వలంటీర్లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు వలంటీర్ టీచర్లు తమవంతు కృషి చేయాలన్నారు. రోజూ అక్షర కేంద్రాలను నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.వాణి, సీసీలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం మార్పు

ఇంకొల్లు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో కొనసాగుతున్న మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సమీపంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలోకి శుక్రవారం మార్చినట్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మీ, ఎంపీపీ బండారు అనూష, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై సీఎం ప్రత్యేక దృష్టి

శాసనసభ్యుడు ఎంఎం కొండయ్య

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాంకేతిక పరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చీరాల శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ టెక్నాలజీని పరిచయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేకమైన శైలి ఉందని చెప్పారు. ఈనేపథ్యంలోనే రాష్ట్రంలో సీసీ కెమెరాలు అమర్చడంలో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పరిపాలన చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఉన్నారు.


డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య


కారంచేడులో డీజీపీ ద్వారకా తిరుమలరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, గ్రామస్థులు

డీజీపీకి కారంచేడులో ఘన సన్మానం

కారంచేడు(పర్చూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శుక్రవారం కారంచేడు గ్రామంలో ఘనంగా పౌరసన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు , చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య , డీఐజీ త్రిపాఠి, జిల్లా ఎస్పీ తూషార్ డూడీ హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ మాట్లాడుతూ కారంచేడు గ్రామానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంచి గుర్తింపు ఉందని, ఈ ప్రాంత వాసులు అత్యున్నత విద్యా సంస్థ అయిన జేకేసీ వంటి కళాశాలలో సభ్యులుగా ఉండటం దీనికి నిదర్శనం అని అన్నారు. తాను కారంచేడు ప్రాంతంలో జన్మించక పోయినా తన తల్లి దండ్రుల మీద ఉన్న మమకారంతో తనను ఈ ప్రాంత వాసిగా గుర్తించి ఇంత పెద్ద ఎత్తున సన్మానించటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో నిస్వార్థంగా పనిచేశానని, అందుకు నిదర్శనం ఇంత వరకు తనపై ఎలాంటి ఆరోపణలు లేకపోవటం తనకు సంతృప్తి కలిగిందన్నారు. చట్టం ముందు అందరు సమానులే అని కొన్ని సందర్భాల్లో స్నేహాలను, బంధుత్వాలను, కుల మతాలను విడిచి పని చేయాల్సి ఉంటుందన్నారు. అలాంటి సందర్భాలు కూడా తన ముందుకు వచ్చినా విధి నిర్వహణలో చట్టం ముందు అందరు సమానులే అన్న ఆలోచనతోనే పనిచేశానన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ఉన్నత పదవిని అలంకరించినా నిరాడంబరంగా ఉన్న వ్యక్తి డీజీపీ ద్వారకా తిరుమలరావు అని కొనియాడారు. అంతటి ఉన్నతమైన వ్యక్తిని పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని కోరారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

అద్దంకిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను పుట్టనిద్దాం, చదివిద్దాం, రక్షిద్దాం అనే వాటిని ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించి, ఆచరించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్ట్ సీడీపీవో ఏ. కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్య వివాహాలు, వృత్తి శిక్షణ, నైపుణ్యం, రక్తహీనత, సమతుల ఆహారం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యతోనే సాధికారత

మేదరమెట్ల: బాలికలకు విద్యతోనే సాధికారత వస్తుందని కొరిశపాడు ఐసీడీఎస్ సీడీపీవో ఏ. కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా తిమ్మనపాలెం హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులతో ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాన అవకాశాలు కల్పించాలి

పంగులూరు : లింగ భేదం లేకుండా పుట్టిన ప్రతిబిడ్డ ఎదుగుదలకు తల్లిదండ్రులు సమాన అవకాశాలు కల్పించాలని పీహెచ్‌సీ సీఎస్‌వో హిమబిందు కోరారు. మండల వైద్య సిబ్బంది శుక్రవారం పలు పాఠశాలల్లో స్థానిక ఉపాధ్యాయులతో కలిసి జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. అవకాశాలను అంది పుచ్చుకుని చదువుతో పాటు ఆటపాటల్లో రాణించి బాలికలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ బాలరాజేశ్వరి, డాక్టర్ శివచెన్నయ్య, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికల సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

చినగంజాం : బాలికలు చదువు, క్రీడలు, రక్షణ రంగాల్లో ముందుండాలని చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం డి.రత్నకుమారి, సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్‌లు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య అవశ్యకతను, దాని వలన కలిగే ప్రయోజనాలను హెచ్ఎం వివరించారు బాల్యవివాహ నిషేధ చట్టం, లింగ సమానత్వం, విద్యాహక్కుచట్టం గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సుమలత అవగాహన కల్పించారు. సంతరావూరు గ్రామంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఎస్.సౌజన్య, సంతరావూరు యూపీ పాఠశాల హెచ్ఎం సత్యానందం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చినగంజాం జడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవలో..

బల్లికురవ : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, వైద్యాధికారి రవితేజ తదితరులు బాలికలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.


ప్రధానోపాధ్యాయిని మల్లీశ్వరిని సత్కరిస్తున్న ప్రతినిధులు

లింగవివక్ష లేకుండా చూడాలి

వేటపాలెం(చీరాలటౌన్) : బాలికల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని పలువురు వక్తలు అన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షత లేకుండా చిన్నారుల ఆలోచన సరళిని మార్చాలని సూచించారు. అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. చిన్నారులతో కోలాటం నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయిని మల్లీశ్వరిని ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రత్తి వెంకట సుబ్బారావు, బుర్ర సాంబశివరావు, లక్ష్మీ ప్రసాద్, శివ పార్వతి, లలిత, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో...

వేటపాలెం బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి, ఎంఎల్‌హెచ్‌పీ సిరోరాణి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పర్చూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎమ్మెల్యే ఏలూరి క్యాలెండర్‌ను శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, గుంటి వెంకటేశ్వర్లు,జంపని సాంబశివరావు, తేలప్రోలు సాంబశివరావు,పెంట్యాల శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులతో సమీక్ష

పర్చూరు నియోజకవర్గంలోని వ్యవసాయ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమీక్ష నిర్వహించారు. వరి పంటను పండించిన రైతులకు సకాలంలో మద్దతు ధర చెల్లించి పంటను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యం పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏడీఏ భాస్కరరావు, మోహనరావు, శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారులు అంజిరెడ్డి, మేరియమ్మ, కిరణ్, సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరితో నాయకులు


చేనేతపురి కాలనీలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

మోసపూరిత వ్యక్తులకు దూరంగా ఉండండి

● రూరల్ సీఐ శేషగిరిరావు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వ్యక్తుల నుంచి సామాన్య ప్రజలు దూరంగా ఉండాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. వేటపాలెం మండలం చేనేతపురి కాలనీలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయని చెప్పారు. ఇటువంటి వాటిపై ప్రజలు అవగాహన పొందాలన్నారు. అలాగే గ్రామంలో వీధి దీపాలు కచ్చితంగా పని చేసేలా చూడాలన్నారు. ప్రజలు స్నేహ భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు గులాబీపూలు అందిస్తున్న అధికారులు

డ్రైవర్లు ప్రశాంతంగా బస్సులను నడపాలి

అద్దంకి, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌లు విధులలో ప్రశాంతంగా ఉండి బస్సులను నడపటం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చని ఎంవీఐ ప్రసన్నకుమారి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్‌లకు గులాబి పుష్పాలు అందజేసి స్వాగతించి అభినందించారు. విధులలో ఏకాగ్రత ముఖ్యమని, అదే సమయంలో ఎదుటి వాహనాల డ్రైవర్‌లను ఒక కంటితో కనిపెట్టి ఉండాలన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో, దించే సమయంలో ఖచ్చితంగా పూర్తి రోడ్డు మార్జిన్‌లో మాత్రమే బస్సులను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ అంకమ్మరావు, అగ్నిమాపక కేంద్రం ఎస్సై వెంకటరావు, అద్దంకి రూరల్ ఎస్సై రవితేజ, డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి, సీఆర్‌సీ కొండలు తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్లకు భూమిపూజలో తెలుగుదేశం నాయకులు

పూనూరులో సీసీరోడ్లకు భూమిపూజ

యద్దనపూడి,(మార్టూరు)జనవరి (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శుక్రవారం రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు గ్రామంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దాంతో 3 సిమెంటురోడ్లు దాదాపుగా 270 మీటర్లు పొడవుతో నిర్మాణం చేసేందుకు ప్రణాళికను తయారుచేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోయపాటి సాంబశివరావు, నీటి సంఘం అధ్యక్షులు గన్నమనేని ప్రభాకరరావు, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఈదల అనిల్, తల్లపనేని సుధాకర్,పావులూరి రామారావు, ఈదల రవి, తిరుపతి రాయుడు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


కోటపాడు గ్రామంలో దూడలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న వైద్యాధికారి మురళీకృష్ణ

పశువులకు మెరుగైన వైద్యం

పంగులూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించి ఎదఇంజక్షన్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, ఏహెచ్‌వోలు శ్రీనివాసులు, అర్షియా శివనాయక్, రమేష్, బాజీబాబు, పశుపోషకులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కారు ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలు

మేదరమెట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద రోడ్డు దాటుతున్న మహిళలను కారు ఢీ కొంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి తిమ్మనపాలెంలో జాతీయ రహదారికి పడమటి వైపు నుంచి తూర్పు వైపునకు వస్తున్న చెరుకూరి భూలక్ష్మి, వడ్లమూడి రమణలను జె. పంగులూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు ఢీ కొంది. ఈప్రమాదంతో తీవ్రంగా గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించించారు. మేదరమెట్ల ఏఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

భవనాసి కాలువలో వృద్ధురాలి మృతదేహం

అద్దంకి, జనవరి24(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం వద్ద భవనాసి కాలువలో వృద్ధురాలి మృతిదేహం లభ్యమైంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని గొరకాయపాలెంకు చెందిన ఆర్. కోటిరత్నమ్మ(78) శు క్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. సుమారు 12 గంటల సమయంలో భవనాసి కాలువలో కోటిరత్నమ్మ మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం

మేదరమెట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దువానిపాలెంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయ్యింది. గ్రామంలోని చింతం వెంకటస్వామికి చెందిన ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలన్నీ కాలిపోయ్యాయి. దుస్తులు, ఇతర వస్తువులు బూడిదయ్యాయి. సుమారు రూ. 10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. మంటలను అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది ఆర్పారు.


మంటలను అదుపుచేస్తున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది